# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 24-10-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రి వర్గ సమావేశం ఈరోజు న్యూఢిల్లీలో జరిగింది.
- ❖ ప్రకృతి వైపరీత్యాలు, సహాయక చర్యల్లో సరిహద్దు పోలీసుల కృషి ప్రశంసనీయమని ప్రధానమంత్రి అన్నారు.
- ❖ సరిహద్దు రేఖ వెంబడి పూర్వ పరిస్థితిని పునరిద్ధరించడానికి భారత్ - చైనా దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదిరిందని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు.
- ❖ “దానా” తూఫాన్ దృష్ట్యా ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు జాగత్త చర్యలు చేపట్టాయి.

========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రి వర్గ సమావేశం ఈరోజు న్యూఢిల్లీలో జరిగింది. అంతరిక్ష రంగానికి 1000 కోట్ల రూపాయల వెంచర్ క్యాపిటల్ ఫండ్ ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రతిపాదిత వెంచర్ క్యాపిటల్ ఫండ్ విస్తరణ వ్యవధి ఫండ్ కార్యకలాపాలు ప్రారంభమైన వాస్తవ తేదీ నుండి 5 సంవత్సరాల వరకు ఉండేలా ప్రణాళిక చేయబడింది. ఈ రోజు న్యూఢిల్లీలో కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పాత్రికేయులతో మాట్లాడుతూ... బడి అవకాశాలు, నిధుల అవసరాలను బట్టి సగటు విస్తరణ మొత్తం సంవత్సరానికి 150 నుండి 250 కోట్ల రూపాయల వరకు ఉంటుందని పేర్కొన్నారు. భారతదేశ అంతరిక్ష రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఈ ఫండ్ ఉపకరిస్తుందన్నారు. రానున్న 10 సంవత్సరాల్లో 30 నుంచి 35 అంతరిక్ష రంగ అంకుర సంస్థలకు ఇది నిధులు సమకూరుస్తుందన్ని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

========================

ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ రైజింగ్ డే సందర్భంగా ITBP కుటుంబాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. సరిహద్దు పోలీసులు అత్యంత సవాలుగా ఉన్న భూభాగాలు, కఠినమైన వాతావరణ పరిస్థితులతో సహా ప్రజలను రక్షించడానికి అంకిత భావంతో పని చేస్తారని సామాజిక మాధ్యమం వేదికగా నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, రెస్క్యూ ఆపరేషన్లలో  వారు చేసిన కృషిని ప్రశంసించారు.

=======================

సరిహద్దు రేఖ వెంబడి పూర్వ పరిస్థితిని పునరిద్దరించడానికి భారత్ - చైనా దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదిరిందని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన చాణక్య డిఫెన్స్ డైలాగ్- 2024 ప్రారంభ సమావేశంలో మంత్రి ప్రసంగిస్తూ... అభివృద్ధి, భద్రతకు సంబంధించి భారతదేశానికి విలక్షణమైన దృక్పథం ఉందని అన్నారు. సరిహద్దు రేఖ LAC వెంబడి కొన్ని ప్రాంతాల్లో విభేదాలను పరిష్కరించుకునేందుకు భారత్ - చైనా దౌత్య, సైనిక స్థాయిల్లో చర్చలు జరుపుతున్నాయని రాజ్ నాథ్ సింగ్ వెల్లడిస్తూ....

(వాయిస్ 33 సెకన్లు)

=======================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపటి నుంచి రెండు రోజుల పాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో పర్యటించనున్నారు. రేపు రాయ్‌పూర్‌లోని ఏయిమ్స్ 2వ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి పాల్గొననున్నారు. అలాగే శనివారం రాష్ట్రపతి IIT, భిలాయ్‌లో నాల్గవ స్నాతకోత్సంలో పాల్గొనున్నారు. రాయ్‌పూర్‌లోని దీనదయాళ్ ఉపాధ్యాయ మెమోరియల్ హెల్త్ సైన్స్, చత్తీస్‌గఢ్‌లోని ఆయుష్ విశ్వవిద్యాలయాన్ని సందర్శిస్తారు.

=======================

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (UNSC)లో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించాల్సిన అవసరం ఉందని భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. రష్యాలోని కజన్‌లో జరుగుతోన్న 16వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ... ప్రపంచ క్రమం రూపాంతరం చెందుతున్న తీరుకు బ్రిక్స్ ఓ ఉదాహరణ అన్నారు. ప్రపంచ క్రమాన్ని సృష్టించేందుకు అంతర్జాతీయ అత్యున్నత సంస్థల్లో సంస్కరణలు తక్షణ అవసరమని తెలిపారు.

=======================

"దానా" తూఫాన్ ఈరోజు అర్ధరాత్రి నుంచి రేపు ఉదయం లోపు భితార్కానిక, ధమ్రా సమీపంలో పూరీ, సాగర్‌దీప్ దీవుల మధ్య తీరం దాటనుందని భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు. ఈరోజు ఆయన దాన తూఫాన్ పై వివరాలు వెల్లడిస్తూ... తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని అంచనా వేస్తున్నామన్నారు. ప్రస్తుతం తీర ప్రాంతాల్లో గంటకు 60-70 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయన్నారు. జగత్ సింగ్ పూర్, కేంద్రపారా, భద్రక్, బాలాసోర్ జిల్లాల్లో గాలుల వేగం ఎక్కువగా ఉంటుందని వర్షపాతం తీవ్రత క్రమంగా పెరుగుతుందని అన్నారు. ఖుర్దా, పూరీ, జగత్ సింగ్ పూర్, కేంద్రపడా, భద్రక్, బాలాసోర్, మయూర్భంజ్, కియోంఝర్, ధెంకనాల్, కటక్ వంటి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయన వివరిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

=======================

"దానా" తుఫాన్ దృష్ట్యా పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రంలోని తీర ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఫ్లడ్ షెల్టర్లు తెరిచారు. సాగర్ ద్వీపం, సుందర్

బన్‌లోని ఇతర ప్రాంతాలలో ఫెర్రీ సేవలు నిలిపివేసారు. వాతావరణం అనుకూలించే వరకు పశ్చిమ బెంగాల్ తీరం వెంబడి ఉన్న మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని హెచ్చరించింది.

అలాగే ఒడిశాలోని భువనేశ్వర్‌లోని బిజు పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఈరోజు సాయంత్రం నుండి రేపు ఉదయం 9 గంటల వరకు అన్ని విమాన సర్వీసులు రద్దు చేశారు. పెద్ద సంఖ్యలో ప్యాసింజర్ రైళ్లను కూడా రద్దు చేశారు. రేపటి వరకు మొత్తం ఈ ప్రాంతంలో 40 విమానాలు, 200 రైళ్లు రద్దు చేయబడ్డాయి.

========================

దీపావళి, ఛత్ పూజ పండుగల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే మంత్రిత్వ శాఖ 7 వేల ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఈ ప్రత్యేక రైళ్లలో రోజుకు రెండు లక్షల మంది అదనపు ప్రయాణికులు ప్రయాణించవచ్చని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ న్యూఢిల్లీలో తెలిపారు. గత సంవత్సరం 4,500 రైళ్లు నడపగా, ఈ ఏడాది ప్రత్యేక రైళ్ల సంఖ్య 7 వేలకు పెరిగిందన్నారు.

విరామం

========================

అల్బేనియాలోని టిరానాలో ఈరోజు జరిగిన అండర్-23 ప్రపంచ ఛాంపియన్‌షిప్ రెజ్లింగ్‌లో భారతదేశానికి చెందిన విశ్వజిత్ రామచంద్ర మోర్ కాంస్య పతకాన్ని సాధించాడు. పురుషుల 55 కేజీల గ్రీకో - రోమన్ విభాగంలో రామచంద్ర మోర్ 14-10 తేడాతో ఆడమ్ ఉల్బాషెవ్‌ను ఓడించాడు. ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఇదే తొలి పతకం.

అలాగే భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య పూణే వేదికగా జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో మొదటి రోజున తొలుత బాటింగ్ చేసిన న్యూజిలాండ్ 259 పరుగులకు ఆలౌట్ అయ్యింది. భారత్ బౌలర్లలో వాషింగ్టన్ సుందర్ అత్యధికంగా 7 వికెట్లు తీశాడు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్ ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ నష్టపోయి 11 పరుగులు చేసింది. కాగా 3 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో 0-1 తేడాతో భారత్ వెనుకంజలో ఉంది.

========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు సాధారణంగా ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 80,098 పాయింట్ల వద్ద ప్రారంభమై, చివరికి 16 పాయింట్ల నష్టంతో 80,065 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 36 పాయింట్లు నష్టపోయి 24,399 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.07గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 76.49 డాలర్లు ఉండగా.. బంగారం ఔన్సు 2,749 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

========================

విద్యార్థులు తరగతి గదులకే పరిమితం కాకుండా నైపుణ్యాన్ని పెంచుకునే దిశగా కృషి చేయాలని కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరి అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో వరల్డ్ స్కిల్స్ - 2024 విజేతలను ఆయన సత్కరించి, ప్రతిభ కనబరిచిన విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... కృషి, పట్టుదలతో తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని అన్నారు.

========================
========================